క్లుప్తంగా

ఎంపీని కలిసిన తుడుందెబ్బ నాయకులు



ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్: ఎంపీ గోడం నగేశ్‌ను తుడుందెబ్బ నాయకులు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీగా ఎన్నిక కావడంపై శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావు మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో మొరం రోడ్డు



మొరం వేయిస్తున్న రైతులు

బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామ శివారులోని చేలకు వెళ్లే దారి పూర్తిగా బురద మయంగా మారడంతో రైతులు తమ సొంత డబ్బులు పెట్టి మొరం రోడ్డును వేసుకున్నారు. దాదాపు పది మంది రైతులు తలా కొంత డబ్బులు జమ చేసి ఆదివారం బురదమయంగా మారిన రోడ్డుపై మొరం వేశారు. నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నామన్నారు. పండిన పంటను ఇంటికీ తీసుకువచ్చేందుకు ఇబ్బందిపడుతున్నామని, దీంతో రైతులందరం కలిసి రోడ్డు వేసుకున్నామని వారు పేర్కొన్నారు.

'ప్రజాసేవకు పదవితో పనిలేదు'



నర్సయ్యను సన్మానిస్తున్న నాయకులు

బజార్‌హత్నూర్: ప్రజలకు సేవ చేయాలనే ఆకాంక్ష ఉంటే పదవితో పనిలేదని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాజీ జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య తన పదవీకాలం పూర్తయిన సందర్భంగా ఆత్మీయ వీడ్కోల్ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ నర్సయ్యతో పాటు ఎంపీపీ అజాడే జ యశ్రీ, ఎంపీటీసీలను సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, మండల అధ్యక్షుడు జల్కే పాండురంగ్, బత్తిని కిషన్, సూర్యవంశీ పాండు, కీర్తి వెంకట రమణ, ఇర్ల శివుడు, విఠల్, పసుల చంటి, మహమూద్, రవి, పద్వల్ రాజు, నందుకుమార్, దినేష్, జగదీష్, రఘన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరామర్శ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఫిరంగి మల్లేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు ప్రహ్లాద్, యాసం నర్సింగరావు, మాజీ ఎంపీపీ సెవ్వ లక్ష్మి జగదీష్, సతీష్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

సిరిచెల్మ ఘాట్ రోడ్డులో లారీ బోల్తా

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ ఘాట్ రోడ్డులో ఆదివారం సాయంత్రం ఓ లారీ బోల్తా పడింది. ఇచ్చోడ నుంచి సిరిచెల్మ వైపు ఎరువుల లోడ్‌తో వెళ్తున్న లారీ ఘాట్ రోడ్డుపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు పెను ప్రమాదం తప్పింది. అనంతరం లారీలో ఉన్న ఎరువుల బస్తాలను మరో వాహనంలో తరలించారు.

పల్లీల దొంగ అరెస్టు

ఎదులాపురం: పట్టణ టుటౌన్ పరిధిలోని శ్రీనాథ్ జిన్నింగ్‌లో ఇటీవల పల్లీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. చోరీకి పాల్పడ్డ వారిలో ముగ్గురిని అరెస్టు కూడా చేశారు. మరో దొంగ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన షేక్ తబ్రేజ్ పరారీలో ఉండగా.. ఆయనను ఆదివారం పట్టుకున్నట్లు టుటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. అతడి నుంచి రూ. 2 క్వింటాళ్ల పల్లీలు, 20 మీటర్ల ఎల్‌టీ వైర్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నాణ్యతకు పాతర..

- రూ.7.10 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణం
- నాసిరకం ఇసుకతో పనులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



మణియార్‌పూర్ శివారులో కొనసాగుతున్న వంతెన పనులు

బేల: మండలంలోని మణియార్‌పూర్ గ్రామ శివారులో ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో రూ.7.10 కోట్ల వ్యయంతో హైలెవల్ వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నాసిరకం ఇసుకతో నిర్మాణ పనులు చేపడుతున్నా.. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడిందని స్థానికులు అంటున్నారు. ఇదిలా ఉండగా.. ఏళ్ల నుంచి మండలంలోని పెన్‌గంగ పరివాహక ప్రాంతంలోని సాంగిడి, కొత్త సాంగిడి, బెదోడ, కాంఫుర్‌పూర్, గూడ, మణియార్‌పూర్ గ్రామాలవాసులకు వర్షకాలంలో బ్యాక్ వాటర్‌తో లోలెవల్ వంతెనపై నుంచి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఎట్టకేలకు లోలెవల్ వంతెన చోట హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.7.10కోట్లు మంజూరయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల ముందు భూమిపూజ చేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. మరోసారి ప్రస్తుత ఎమ్మెల్యే పాయల్ శంకర్ గత మార్చి నెల 14న వంతెన నిర్మాణానికి భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు.

నల్ల ఇసుక వినియోగం..

మండలంలోని అత్యధికంగా నిధులు మంజూరైన వంతెన నిర్మాణ పనుల్లో పెద్ద వాగు ఇసుకను వినియోగించాల్సి ఉంది. ప్రారంభంలో పునాది నిర్మాణానికి కొంచెం పెద్ద వాగు ఇసుక వాడినప్పటికీ, ఆ తర్వాత నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో స్థానిక పెన్‌గంగ నుంచి తీసుకువచ్చిన మట్టి శాతం ఎక్కువ ఉన్న నాసిరకం ఇసుకను వినియోగిస్తున్నారు. ఫిల్లర్ల గోడలలో సన్నని రాడ్లు మాత్రమే వాడుతున్నారు. ఈ విషయం ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలిసినప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మూడు ఫిల్లర్ల గోడలు పూర్తయ్యాయి. మరో మూడు ఫిల్లర్ల గోడల నిర్మాణంలో ఉన్నాయి. మరో ఫిల్లర్ గోడతో పాటు స్లాబ్ నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంది. ఈ పనులు అధికారుల పర్యవేక్షణ లేకుండా కొనసాగుతోందని స్థానికులు అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణ పనులు నాణ్యతగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మణియార్‌పూర్ శివారులో రూ.7.10కోట్ల వ్యయంతో హైలెవల్ వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వర్షంలోనూ పనులు చేస్తున్నారు. స్థానిక పెన్‌గంగ నుంచి తీసుకువచ్చిన నాసిరకం ఇసుకను వాడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాలి. – అవినాష్, గూడ

నాణ్యతగా చేపట్టాలి



మణియార్‌పూర్, దహెగాం గ్రామాల మధ్య కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న వంతెన నిర్మాణ పనులను నాణ్యతగా చేయించాలి. వంతెన పనుల్లో పెద్ద వాగు ఇసుక ఏమాత్రం వాడుతలేరు. పెన్‌గంగ నల్లని ఇసుక వాడుతున్నారు. భవిష్యత్‌లో వంతెన పటిష్టంగా ఉండేలా నాణ్యతగా చేపట్టాలి. –ఎండీ షకీల్, దహెగాం

పంట చేను కాదు.. పెన్‌గంగ నది



జైనథ్: శనివారం మండలంలో కురిసిన వర్షానికి పెన్‌గంగ నదిలో భారీగా గుర్రపు డెక్క కొట్టుకువచ్చింది. తరోడ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన కారణంగా వేసవిలో సాత్నాల వాగులో కిలోమీటర్ల మేర మురుగు నీరు నిల్వ ఉండటంతో, భారీగా గుర్రపు డెక్క పెరిగింది. కాగా తాత్కాలిక వంతెన తెగిపోవడంతో పెద్ద సంఖ్యలో గుర్రపు డెక్కలు పెండల్‌వాడ సమీపంలో సాత్నాల వాగు నుంచి పెన్‌గంగలో కొట్టుకొని రావడంతో నది మొత్తం పచ్చగా మారింది. పెన్‌గంగ నదిపై మొక్కలు మొలిసినట్లు కనిపించిన ఈ దృశ్యాలను పలువురు కెమెరాల్లో బంధించగా.. ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది.

వన దేవతకు పూజలు



వనదేవతకు మొక్కుతున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని గోండ్‌గూడ, పర్ధాన్‌గూడతో పాటు పొల్లుగూడ, కేస్లాగూడ గ్రామాల్లో ఆదివారం వనదేవత (అకాడి) పూజలు నిర్వహించారు. గ్రామ పోలిమేరలోని అటవీప్రాంతానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. చిరు ధాన్యాలతో తయారు నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం పశువులు, ఎడ్లు, మేకలను వనదేవతల చుట్టూ ప్రదక్షిణాలు చేయించారు. అనంతరం సహపంక్తి భోజనలు చేశారు.

ఇంద్రాదేవి ఆలయంలో..

ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆశాడం పూజలు చేశారు. ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఆదివారం మండలంలోని మెండపల్లి, దనోర గ్రామాలతో పాటు గుడిహత్నూర్, ఉట్నూర్ గ్రామాల ఆదివాసీలు ఆలయానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న భక్తులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని తిరుమలనగర్‌లో ఆదివారం మహా పోచ్చమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు దేవిదాస్, ప్రేమ్ సింగ్‌లు మాట్లాడుతూ కాలనీలోని ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆతల్లిని వేడుకోవడం జరిగిందన్నారు. వార్డు కౌన్సిలర్ లక్ష్మణ్, కృష్ణ యాదవ్, కాలనీవాసులు సురేందర్, రవీందర్ రెడ్డి, చంద గణేశ్, ఆనంద్ రెడ్డి, నారాయణరెడ్డి, గంగసర్పు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సబ్‌స్టేషన్ సిద్ధం



ప్రారంభానికి సిద్ధమైన సబ్‌స్టేషన్

- సిర్సన్నలో రూ.1.54కోట్లతో నిర్మాణం
- ఏడాదిలో పూర్తయిన పనులు
- తీరనున్న లోవోల్టేజీ, విద్యుత్ సమస్యలు

బేల: మండలంలోని సిర్సన్న రెవెన్యూ శివారులో నూతన విద్యుత్‌సబ్‌స్టేషన్ ప్రారంభానికి సిద్ధమైంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి మూడేళ్ల క్రితం ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ. 1కోటి 54లక్షలు మంజూరు చేసింది. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ఒక ఏడాదిలో పూర్తయ్యాయి. దీంతో ఇక్కడి నుంచి విద్యుత్ సరఫరా గ్రామాలకు లోవోల్టేజీ, విద్యుత్ అంతరాయ సమస్యలు త్వరలోనే తీరనున్నాయి. కాగా పెండింగ్‌లో ఉన్న 33 కేవీ లైన్ పనులు గత నెలలో పూర్తయ్యాయి. దీంతో విద్యుత్ సబ్‌స్టేషన్ పూర్తి హంగులతో ప్రారంభానికి సిద్ధమైంది. జిల్లా ఇన్‌చార్జి రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభం కానుందని సమాచారం. సబ్‌స్టేషన్ ప్రారంభంతో మండలంలో సబ్‌స్టేషన్‌ల సంఖ్య నాలుగుకు చేరనుంది. సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా కోసం సిర్సన్న టౌన్, సిర్సన్న ఏజీల్(వ్యవసాయం) రెండు ఫీడర్‌లు ఏర్పాటు కానున్నాయి. ఒకటో ఫీడర్ పరిధిలో సబ్‌స్టేషన్ నుంచి సిర్సన్న గ్రామానికి ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా ఉండనుంది. రెండో ఫీడర్‌లో భాగంగా సిర్సన్న ఏజీల్ ఫీడర్ పరిధిలో సిర్సన్న, సింగాపూర్, బాది, అవాల్‌పూర్ రెవెన్యూ శివారుల్లో చేన్లలో వ్యవసాయానికి త్రీఫేజ్ సరఫరా ఉండనుంది. దీంతో పాటు అనుసంధానంగా బాది, వడగూడ, అవాల్‌పూర్ గ్రామాలకు సైతం విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

నేడు వైఎస్‌ఆర్ జయంతి వేడుకలు

కైలాస్‌నగర్: మహా నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్. రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజాభవన్‌లో నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వైఎస్‌ఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పంట వివరాలు నమోదు

బోథ్: మండలంలోని బోథ్(బి) శివారు, కనుగుట్ట గ్రామ శివారులో ఆదివారం వ్యవసాయ విస్తరణ అధికారులు పంటల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. రైతులు తమ వ్యవసాయ భూమిలో పండిస్తున్న పంటల వివరాలను నమోదు చేశారు. ఎవరైతే తమ పంటలను నమోదు చేసుకోలేకపోతే తమను సంప్రదించాలన్నారు. క్షేత్రస్థాయిలో సందర్శించి పంటలను నమోదు చేస్తామన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో ఫొటోగ్రాఫర్ల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫొటోగ్రాఫర్ మండల కమిటీ అధ్యక్షుడిగా కల్లూరి ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా జాదవ్ విజయ్, ప్రధాన కార్యదర్శిగా సాయినంద్, సంయుక్త కార్యదర్శిగా యేర్మ విద్యాసాగర్, కోశాధికారిగా దూట రాహుల్‌లను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కప్పతల్లి ఆట



కప్పతల్లికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఆదివారం కప్పతల్లికి పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కప్పతల్లి ఆడారు. ఈసందర్భంగా గ్రామంలో పలు వీధుగా గుండా కప్పను కట్టి ఇంటింటికీ తీసుకెళ్లారు. కప్పకు నీరు పోసి వర్షాలు కురవాలని గ్రామస్తులు మొక్కుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా సీఆర్ఆర్ వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు



బోథ్‌లో..

ఆదిలాబాద్‌రూరల్: మాజీ మంత్రి చిల్కూరి రామ చంద్రారెడ్డి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఆదివారం మావల మండల కేంద్రంలోని చిల్కూరి లక్ష్మిగార్డెన్‌లో ఏర్పాటు చేసిన వర్ధంతి వేడుకలకు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఆర్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దీంతోపాటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, నాయకులు, కార్యకర్తలు హాజరై నివాళులర్పించారు. సీఆర్ఆర్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సీఆర్ఆర్ చేసిన సేవలను కొని యాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, దిగంబర్‌రావు పాటిల్, అశోక్, సంజీవ్, ముడుపు ప్రభాకర్ రెడ్డి, నళిని రెడ్డి పాల్గొన్నారు.

బోథ్: మాజీ మంత్రి సి.రామచంద్రారెడ్డి వర్ధంతిని ఆదివారం బోథ్ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు చేసిన ఆయన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ ఎంపీటీసీ కుర్మె మహేందర్, మెరుగు భోజన్న, మహహ్మద్, లింగారెడ్డి, గంగారాం, రమేశ్, శేఖర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: మావల గ్రామంలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రామగిరి కుమార్, కుశాల్ జాడేలను మా వల గ్రామస్తులు వీడ్కోలు పలికారు. ఆదివా రం వారిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, మా ర్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రహ్లాద్, యాసం నర్సింగ్ రావు, యూనిస్ అక్బాని, మాజీ జెడ్పీటీసీ నల్ల రాజేశ్వర్, ఉమాకాంత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ హాజరయ్యారు.

ప్రజాప్రతినిధులకు..

బోథ్: ఇటీవల తమ పదవీ కాలం పూర్తి చేసుకున్న మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, జిల్లా కోఆప్షన్ సభ్యులు తాహెర్‌లను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. బోథ్ మండల అభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. కార్యక్రమంలో సోనాల మాజీ సర్పంచ్ చెట్లపల్లి సదానందం, సోనాల గ్రామ కమిటీ అధ్యక్షుడు మునేశ్వర్ సోమన్న, భోజరాజు, జీవన్, రామాయి శంకర్, కిష్టయ్య పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలో అడేగామ(కె) మాజీ ఎంపీటీసీ కొత్తూరి సుజాతను ఆదివారం అడేగామ(కె) కాలనీలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా సన్మానించారు. సుజాత ఐదు సంవత్సరాల పాటు ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వర్తించి, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

ఆదిలాబాద్‌రూరల్: గత నెల 30న గ్రేడ్– 2 ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అరుగుల సత్యనారాయణ గౌడ్‌ను పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎంపీ గోడం నగేశ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీపాల్ రెడ్డి, కమలాకర్ రావ్, బాలచందర్, కుడల రవీందర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగురవేస్తున్న నాయకులు

బోథ్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు జెండా ఎగురవేశారు. గత 30 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వేషన్ల కోసం పోరాడుతూనే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పోరాడుతున్నారని తెలిపారు. వికలాంగుల పింఛన్, గుండె జబ్బులు ఉన్న పిల్లలకు ఉచితంగా ఆపరేషన్లు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు మందకృష్ణ ఆలోచనేనని అన్నారు. కార్యక్రమంలో కుడాల స్వామి, కారెం రవి, అన్నెపాక అశోక్, ప్రసాద్, పాలెపు గోపి, సాయి, భిక్క అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కాంబ్లే బాలాజీ, ఇంద్రవెల్లి మండల నాయకులు ఉప్పరి డేవిడ్, నర్సయ్య, గోవింద్, సందేపాల్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం'

నార్నూర్: మాదిగ అమరవీరుల సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధిస్తామని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కొత్రల మహేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. జాతి ప్రయోజనాల కోసం వర్గీకరణ పోరాటంలో భాగంగా ప్రాణ త్యాగాలు చేసిన అమరవీరులకు నివాళులర్పించారు. రాబోయే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లపల్లి సుకుమార్, కాంబ్లే సాయి, జిల్లేపల్లి ప్రకాశ్, మోరే మహేందర్, తరుడే సీతారాం, ఆదిత్య పాల్గొన్నారు.

గోరింటాకు సందడి



గోరింటాకు పెట్టుకుంటున్న మహిళలు

ఇచ్చోడ: ఆషాడం మాసంలో గోరింటాకు పండుగ చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గోరింటాకు పెట్టుకోవడం ఆచారంతో పాటు ఆరోగ్య కారణాలు కూడా ఉంటాయి. అయితే మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గోరింటాకు పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకొని మురిసిపోయారు.

ఘనంగా బోనాల పండుగ



పొచ్చెరలో బోనాలతో మహిళలు

బోథ్: మండల వ్యాప్తంగా ఆదివారం ఆయా గ్రామాల్లో బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పలు సంఘాల రైతులు గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో రజక సంఘం, చైతన్య యూత్ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. మహాలక్ష్మి దేవతకు, భీమన్న దేవుడికి నైవేద్యం సమర్పించారు. పొచ్చెర గ్రామంలో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.